క్లుప్తంగా

11నుంచి ఆరాధనోత్సవాలు

ఆస్పరి: మండలంలోని అట్టేకల్లులో వెలసిన అవధూత పరదేశప్ప తాత 14 ఆరాధనోత్సవాలు ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఆలయంలో పరదేశప్ప తాత సమాధికి గంగపూజ, పంచామృతాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

రాష్ట్ర స్థాయి భజన పోటీలు..

ఆరాధనోత్సవాలు సందర్భంగా ఈనెల 12న రాష్ట్ర స్థాయి భజన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి వరుసగా..రూ.14,400, రూ.11,700, రూ. 9,999, రూ.9వేలు, రూ.8,100, రూ.7,200, రూ.6300, రూ.5,400, 4,500, రూ.3,600, రూ.2,700, రూ.18వందలు ఇవ్వనునట్లు చెప్పారు. పాల్గొనే వారు ఎంట్రీ ఫీజు రూ. 300 చెల్లించాలని వివరాలకు సెల్: 9849223757, 9676235363 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సకాలంలో అద్దెలు చెల్లించాలి

మద్దికెర : పంచాయతీ భవన సముదాయాల్లో దుకాణాలు నిర్వహించుకుంటున్న వ్యాపారులు సకాలంలో అద్దెలు చెల్లించాలని ఈఓ శివకుమార్ సూచించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో వ్యాపారులతో మాట్లాడుతూ ఒక్కొక్కరూ వేలాది రూపాయల అద్దె చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇలాగైతే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అద్దెలు చెల్లించకపోతే గ్రామంలో నీటి సరఫరా, పారిశుద్ధ్య పనులు, సిబ్బందికి జీతాలు సక్రమంగా ఎలా జరుగుతాయన్నారు. ప్రతినెల తప్పనిసరిగా బాడుగలు చెల్లించిన వారికే గదులు ఇస్తామని తెలిపారు.

భోజన పథకాన్ని పక్కాగా అమలు చేయాలి



వెల్దుర్తి బాలికల ఉన్నత పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ ఇందిర

వెల్దుర్తి(కృష్ణగిరి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కాగా అమలు చేయాలని ఎంఈఓ ఇందిర సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మోనూ ప్రకారం భోజనాన్ని అందించాలన్నారు. వంట చేసే పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. విద్యార్థులు క్రీడల్లో రాణించేలా కృషి చేయాలన్నారు.

జనన,మరణాలను నమోదు చేయించండి

హొళగుంద: జనన, మరణాలను 21 రోజు ల్లోపు స్థానిక పంచాయతీ కార్యాలయంలో కుటుంబ సభ్యులు నమోదు చేయించాలని పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ తెలిపారు. చా లా మంది పంచాయతీలో పేర్లు నమోదు చేయి ంచకుండా నిర్లక్ష్యం వహించి సర్టిఫికెట్ల కోసం కార్యలయాల చుట్టూ తిరుగుతున్నారని, దీనివల్ల అధికారులకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. పంచాయతీ కార్యాలయంలో నమోదు చేయకపోతే ఇబ్బందులు పడాల్సి వస్తుందని చెప్పారు.

రేపు మండల మీట్

ఆలూరు: స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో ఈనెల 6వ తేదీన మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రంగమ్మ అధ్యక్షతన నిర్వహిస్తామని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జి.రమాదేవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పంచాయతీల్లో తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీల సదుపాయం, వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనుల కల్పన తదితర అంశాలను చర్చించాలని ఎజెండాలో పొందుపర్చామన్నారు. సమావేశానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



లోకేశ్వరిని అభినందిస్తున్న హెచ్‌ఎం,పీడీ

ఆస్పరి: మండలంలోని కారుమంచి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ అబ్దుల్ లతీఫ్ సోమవారం తెలిపారు. గత నెలలో కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి అండర్- 14 బాలికల విభాగం ఖోఖో పోటీల్లో 8వ తరగతి విద్యార్థిని లోకేశ్వరీ, ఫుట్‌బాల్ పోటీల్లో వెన్నెల, అండర్-17 బాలికల విభాగం ఫుట్‌బాల్ పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని నందిని ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థినులను హెచ్‌ఎం శోభారాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

ముగిసిన ఉత్సవాలు

పత్తికొండ(తుగ్గలి) : మండలంలోని పెద్దహుల్తిలో కొలువైన హుల్తి లింగేశ్వర, కారుమంచేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా తీసుకెళ్లి యథాస్థానంలో ఆలయంలో చేర్చారు. నాలుగు రోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

బాల్యంపై భారం

- విద్యార్థులకు తప్పని పుస్తకాల భారం
- మోత మోయలేక ఆరోగ్య సమస్యలు
- బ్యాగ్ బరువుపై 2017లో ప్రత్యేక జీవో
- అమలుకాని ఎన్‌సీఈఆర్టీ సూచనలు

దేవనకొండలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఓ చిన్నారి చేరింది. కొత్త బ్యాగులో పుస్తకాలు, భోజనం బాక్స్, వాటర్ బాటిల్‌తో స్కూల్‌కు వెళ్తోంది. స్కూల్‌కు వెళ్తున్న ఆనందం ఎన్నో రోజులు నిల్వలేదు. కొద్ది రోజులుగా మెడ, భుజం నొప్పితో బాధపడటాన్ని తల్లిదండ్రులు గుర్తించారు. వైద్యుడిని సంప్రదిస్తే..చిన్నారి రోజువారీ కార్యక్రమాల గురించి డాక్టర్ ఆరా తీశారు. చివరకు స్కూల్ బ్యాగ్ భారం వల్లే ఇలా జరుగుతోందని తేల్చారు. స్కూల్ బ్యాగు భారం తగ్గించేందుకు సలహా ఇచ్చారు. ఇలా ఈ చిన్నారి ఒక్కటే కాదు.. పాఠశాలలకు వెళ్లే బాలలందరూ పుస్తకాల బ్యాగులు మోయలేక ఇబ్బందులు పడుతున్నారు.

దేవనకొండ: పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు పుస్తకాల సంచి భారం ఏటేటా పెరుగుతోంది. దీంతో చిన్నారులు అనారోగ్యానికి గురవుతున్నారన్న వైద్యులు పేర్కొంటున్నారు. నర్సరీ స్థాయి నుంచే క్లాస్ బుక్స్, హోం వర్క్ బుక్స్, అసైన్‌మెంట్లు, వర్క్ బుక్స్, పెయింటింగ్స్, నోట్‌బుక్స్ వాటికి సంబంధించి సరంజామాతో బ్యాగ్ నిండిపోతోంది. దీంతో వాటిని మోసేటప్పుడు చిన్నారులు వంగిపోతున్నారు. ఇక కొన్ని తరగతులు ఒకటి, రెండు ఆపై అంతస్తుల్లో ఉండటం.. వాటిని మోయలేక అవస్థలు పడుతూ.. చివరికి అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ పరిస్థితిని నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా పరిశోధన శిక్షన మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) చేసిన సూచనలు అమలు కావడం లేదు. ఏటా పుస్తకాల సంచి బరువు పెరగడమే తప్పా తగ్గడం లేదు. విద్యార్థి తన శరీర బరువులో రెండో వంతు మోయడం అనారోగ్య సమస్యలను తెచ్చిపెడుతోంది. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో పుస్తకాల సంచి పరిమాణాన్ని తగ్గిస్తూ రాష్ట్రాలకు కేంద్రం సూచనలు చేసింది.

తగ్గని బరువు..

వాస్తవానికి ఒకటి, రెండు తరగతులకు రెండు పుస్తకాలు (లాంగ్వేజెస్, గణితం), మూడు నుంచి ఐదో తరగతి విద్యార్థులకు కేవలం మూడు పుస్తకాలు (లాంగ్వేజెస్, గణితం, ఎన్విరాన్‌మెంట్) ఉండాలి. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) పిల్లలపై ఒత్తిడి తగ్గించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తుంది. అయితే ప్రస్తుతం ఒకటి, రెండు తరగతులకు ఎనిమిది పుస్తకాలు, తర్వాత పెరిగే కొద్దీ అధిక పాఠ్య పుస్తకాలు నోటు బుక్స్ మోయాల్సి వస్తోంది. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల విద్యార్థుల పరిస్థితి చెప్పనక్కర్లేదు.





దేవనకొండలో స్కూల్ బ్యాగు మోయలేక ఇబ్బంది పడుతున్న విద్యార్థి

ఆరోగ్య సమస్యలు..

విద్యార్థులు తమ స్థాయికి మించి బరువు మోస్తుండడంతో పలు రకాల అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉందని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు. వెన్ను, కండరాల నొప్పులకు దారి తీస్తుందంటున్నారు. శారీరక, మానసిక సమస్యలు తలెత్తే అవకాశముందని, చదువులపై ఏకాగ్రత తగ్గుతుందని హెచ్చరిస్తున్నారు. సృజనాత్మకత దెబ్బతినడమే కాకుండా విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతారని వెల్లడిస్తున్నారు.

ఎన్‌సీఈఆర్‌టీ పరిశీలన..

బడి సంచి బరువుపై జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) నిర్వహించిన సర్వేలో నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులను పరిశీలించారు. సాధారణంగా వీరి శరీర బరువు 18 కేజీల నుంచి 22 కేజీల వరకు ఉంటుంది. ప్రభుత్వ బడుల్లో 10 నుంచి 12 కేజీలు, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 14 నుంచి 18 కేజీల పుస్తకాల బరువు ఉంటుండటం గమనించారు. 8 నుంచి 10వ తరగతి విద్యార్థుల శరీర బరువు 40 నుంచి 50 కేజీల వరకు ఉంటే వారు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా భావించాలి. వారు బడికి వెళ్లేందుకు 20 నుంచి 25 కేజీల సంచిని మోయాల్సి వస్తోంది. పాఠ్య పుస్తకాలకు తోడు క్యారేజీ, తాగునీటి బాటిల్స్ తదితరవి అదనం. ప్రభుత్వ బడులు కన్నా ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాల మోత ఎక్కువగా ఉందని మండలి పేర్కొంది. రాష్ట్ర సిలబస్‌తో పాటు పాఠశాలలు ప్రత్యేకంగా రూపొందించిన సిలబస్, ఐఐటీ, సీబీఎస్‌ఈ ఇలా వివిధ రకాల పుస్తకాలను మోయాల్సి రావడం విద్యార్థులకు భారంగా మారుతోంది.

ప్రభుత్వ జీవో ఇలా...

విద్యార్థుల బడి సంచి బరువుపై రాష్ట్ర ప్రభుత్వం 2017లో జీవో నంబర్ 22 విడుదల చేసింది. దాని ప్రకారం తరగతుల వారీగా బ్యాగు బరువు ఇలా ఉండాలని సూచించింది.

తరగతి	బరువు (కిలోలు)
1-2	1.50
3-5	2-3
5-7	4
8-9	4-5
10	5

ఆరోగ్యంపై దుష్ప్రభావం

విద్యార్థులు తమ సామర్థ్యానికి మించి పుస్తకాల సంచిని మోయడం మంచిది కాదు. మానసికంగా బలహీనత, నడుము,వెన్నపూస, కండరాల నొప్పులు బాధిస్తాయి. తద్వారా పిల్లలు చదువుపై దృష్టి పెట్టలేరు. పుస్తకాల నుంచి బరువును తగ్గించే ప్రయత్నాలు కచ్చితంగా చేయాలి.అప్పుడే ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటాడు. చక్కటి విద్యాభ్యాసం చేస్తాడు.

– నజీర్, వైద్యాధికారి, దేవనకొండ



నిట్రవట్టిలో లగేజీని మినీ లారీలో వేస్తున్న కూలీలు

తెలంగాణకు వలస

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి, బిలేహాల్, విరుపాపురం గ్రామాల నుంచి దాదాపు 70 కుటుంబాలు సోమవారం రాత్రి తెలంగాణకు వలస వెళ్లారు. స్థానికంగా వ్యవసాయ పనులు లేక, ఉపాధి పనులు లేక వలస వెళ్తున్నట్లు కూలీలు చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో పత్తి, కూరగాయల తోటల్లో పనులు ఉన్నాయని, పనులు చేసేందుకు పిల్లాపాపలతో కలిసి వలస వెళ్తున్నట్లు తెలిపారు. నిత్యం వందలాది సంఖ్యలో కూలీలు వలస వెళ్తుండటంతో గ్రామాలు ఖాళీ అవుతున్నాయి.


తెలంగాణలో ఉపాధి కూలీ మృతి



ఎస్.శంకర్ (ఫైల్)

హాలహర్వి: మండలంలోని అర్ధగేరి గ్రామానికి చెందిన ఎస్.శంకర్ (40) తెలంగాణ రాష్ట్రంలోని శంకరపల్లికి 20 రోజుల క్రితం వలస వెళ్లాడు. అక్కడ సోమవారం కూలి పనులు చేస్తూ గుండెపోటుతో మృతి చెందాడని బంధువులు తెలిపారు. పని చేస్తుండగా ఛాతిలో నొప్పి అంటూ కింద పడిపోయాడు. తోటి కూలీలు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య లక్ష్మీ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబ పెద్ద చనిపోవడంతో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

ప్రమాదకరంగా వంతెన



కడ్లమాగి రస్తాలో శిథిలమైన వంతెన

హొళగుంద: మండలంలోని కడ్లమాగి రస్తాలో ఉన్న బ్రిటీష్ కాలం నాటి వంతెన శిథిలమై కూలడానికి సిద్ధంగా ఉంది. ఈ మార్గం కడ్లమాగి, గజ్జహళ్లి గ్రామాలతో పాటు పొలాలకు వెళ్లే వారితో నిత్యం రద్దీగా ఉంటుంది. రక్షణగోడలు లేక పోవడం, వంతెన పూర్తిగా శిథిలమవడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని వాహనదారులు, రైతులు భయాందోళన చెందుతున్నారు. ఇక వంతెనకు ఇరు వైపులా రక్షణ గోడలు లేక పోవడంతో రాత్రి సమయాల్లో ప్రమాదాలబారిన పడుతున్నారు. నూతన వంతెన ఏర్పాటుకు అధికారులు కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కంప చెట్లు ఇలా.. ప్రయాణమెలా?



రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంప చెట్లు

హాలహర్వి: మండలంలోని హాలహర్వి–మాచనూరు వెళ్లే రహదారికి ఇరువైపులా కంప చెట్లు పెరిగి మూసుకుపోయాయి. దీంతో ఆ రహదారిలో ప్రయాణించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనం కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా కంప చెట్లు తగిలి ప్రయాణికులు, వాహనదారులకు గాయాలవుతున్నాయి. ఇక చెట్లలో నుంచి విషపురుగులు బయటకు వస్తుండటంతో భయాందోలన చెందుతున్నారు. అధికారులు చెట్లు తొలగించి రోడ్డుకు మరమ్మతులు చేయించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరుతున్నారు.

మాతా, శిశు మరణాల నివారణకు కృషి చేయాలి



కృష్ణగిరి పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీపీఎంఓ డాక్టర్ ఉమా

కృష్ణగిరి: తల్లీ బిడ్డల ఆరోగ్యంతో పాటు మాతా శిశు మరణాల నివారణలో మహిళా ఆరోగ్య కార్యకర్తలదే కీలకపాత్ర అని డీపీఎంఓ డాక్టర్ ఉమా అన్నారు. మండలంలోని సీహెచ్ ఎర్రగుడి గ్రామ సచివాలయం, కృష్ణగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ గర్భం దాల్చిన వెంటనే పరీక్షలు నిర్వహించి మాతా శిశు సంరక్షణ కార్డు అందజేయాలన్నారు. కార్డు లో గర్భిణితో పాటు ప్రసవం అనంతరం శిశువు ఆరోగ్య వివరాలు నమోదవుతాయన్నారు. సంచార చికిత్స వాహనం గ్రామాలకు వచ్చినప్పుడు ఆశా, ఆరోగ్య కార్యకర్తలు గర్భిణులకు వివిధ వైద్య పరీక్షలు చేయించాలచి చెప్పారు. డీపీఓ విజయ్‌రాజు, వైద్యులు వరప్రసాద్, ఎంపీహెచ్‌ఈఓ గజేంద్రారెడ్డి, సామాజిక ఆరోగ్య అధికారి బ్రహ్మేంద్ర, పీహెచ్‌ఎన్ అలివేలమ్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు అందని పుస్తకాలు



చిప్పగిరి అంగన్‌వాడీ - 2 కేంద్రంలో పాత పుస్తకాలతో అభ్యసన సాగిస్తున్న చిన్నారులు

చిప్పగిరి: పాఠశాలలు ప్రారంభమై ఆరు మాసాలు గడుస్తున్నా అంగన్‌వాడీ చిన్నారులకు రావాల్సిన పీపీ1, పీపీ2 పుస్తకాలు నేటికి అందకపోవడంతో చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో పాఠశాల ప్రారంభ రోజునే పుస్తకాలు సంక్రమంగా అందేవి. దీంతో చిన్నారులకు ఆయా కేంద్రాల కార్యకర్తలు బోధించడానికి అనువుగా ఉండేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఇప్పటి వరకు పుస్తకాలు రాకపోవడంతో పాత పుస్తకాలతోనే ఆయాలు, టీచర్లు బోధన సాగిస్తున్నారు. మండలంలో మొత్తం 29 మెయిన్ అంగన్‌వాడీలు ఉండగా, 1 మినీ కేంద్రం ఉంది. వాటిలో మొత్తం గర్భిణులు 275 మంది, బాలింతలు 215 మంది, 0–3 సంవత్సరాల పిల్లలు 1,048 మంది ఉన్నారు. పుస్తకాలను సత్వరమే అందించాలని చిన్నారులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

మారుమోగిన శివనామస్మరణ



బుగ్గలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు



చెరుకులపాడులోని శివాలయంలో అభిషేకం చేస్తున్న కంగాటి శ్రీదేవి

మద్దికెర : శివునికి ప్రీతి పాత్రమైన కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో భక్తులతో శివాలయాలు కిటకిటలాడడమే గాకుండా శివనామస్మరనతో మారుమోగాయి. మహిళలు తెల్లవారుజామున చన్నీటి స్నానాలు చేసి ఇళ్ల ముందు దీపాలు వెలిగించారు. మండల కేంద్రం, బుగ్గలోని సంగమేశ్వరాలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయంలో పురాతన రావిచెట్టు వద్ద దీపాలు వెలిగించారు. కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పత్తికొండ(తుగ్గలి) : మండలంలోని మండగిరి పురాతన రామలింగేశ్వర స్వామి ఆలయంతో పాటు పలు గ్రామాల్లో సోమవారం కార్తీక మాస పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు స్వామికి అభిషేకాలు నిర్వహించారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలోని శివాలయాల్లో మొదటి సోమవారం కార్తీక పూజలను వైభవంగా నిర్వహించుకున్నారు. ప్రసిద్ధ శైవక్షేత్రమైన బ్రహ్మగుండంలో భక్తులు ఉదయం నుంచే పూజలు నిర్వహించి దీపాలు వెలిగించారు. మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్వగ్రామమైన చెరుకులపాడులో కుటుంబసభ్యులతో కలిసి శివాలయంలో అభిషేకాలు, కుంకుమార్చన చేపట్టారు. అనంతరం ఉసిరి చెట్టుకు పూజలు చేసి దీపాలు వెలిగించారు. అలాగే కృష్ణగిరి మండలంలోని పురాతన దేవాలయమైన రామలింగేశ్వరస్వామికి భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

రోడ్డు విస్తరణ చేపట్టాలి

పత్తికొండ(తుగ్గలి) : పట్టణంలో రోడ్డు విస్తరణను పూర్తి చేయాలని సీపీఎం మండల కమిటీ సభ్యుడు చక్రాల్ల వెంకటేశ్వరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీవో కార్యాలయ ఏవో ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అంబేడ్కర్ సర్కిల్ నుంచి చేపట్టిన విస్తరణ పనులు ఊరు వాకిలి వరకు వచ్చి ఆగిపోయాయన్నారు. రోడ్డు వెడల్పు చేసిన చోట కూడా మళ్లీ కొందరు ముందుకు వచ్చి ఆక్రమణలు చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని, అధికారులు కూడా చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఆర్డీవో చొరవ తీసుకుని ఆక్రమణలు తొలగించి రోడ్డు విస్తరణను పూర్తి చేసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని కోరారు. పార్టీ నాయకుడు ప్రభాకర్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు వలి ఉన్నారు.

ఏఎన్‌ఎంపై చర్యలు తీసుకోవాలి



డాక్టర్ రఘురామిరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

ఆస్పరి: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మండలంలోని బిల్లేకల్లు గ్రామంలో పనిచేస్తున్న ఏఎన్‌ఎం వరాలమ్మపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా చేపట్టారు. ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ బిల్లేకల్లులో ఆరోగ్య కేంద్రం దగ్గరకు వెళ్లిన రోగులకు ఏఎన్‌ఎం సరిగా మందులు ఇవ్వక పోవడమే కాకుండా రోగులకు నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్లేకల్లు, అట్టెకల్లు గ్రామాలకు విధుల్లో భాగంగా వెళ్లడం లేదని ఆరోపించారు.చర్యలు తీసుకోవాలని డాక్టర్ రఘురామిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. దస్తగిరి, ఇస్మాయిల్, ఈశ్వర్, షఫీ, బ్రహ్మయ్య, రామాంజిని, రెహమాన్ పాల్గొన్నారు.

నిజాలు తెలుసుకొని మాట్లాడండి

దేవనకొండ: యురేనియం తవ్వకాల అనుమతులపై కూటమి నాయకులు నిజాలు తెలుసుకొని మాట్లాడాలని జెడ్పీటీసీ రామకృష్ణ సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడతూ.. యురేనియం తవ్వకాలకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అనుమతులు ఇచ్చారని, అయితే కొందరు వైఎస్సార్‌సీపీ పాలనలో అనుమతులు ఇచ్చారని విమర్శించడం సరికాదన్నారు. 2017లో అప్పటి ఎంపీపీ రామచంద్రనాయుడు సూచన మేరకే యురేనియం బోర్లు వేయించడానికి అనుమతించామని కొందరు పేర్కొన్న విషయాలనే ఈనెల 2న జరిగిన ధర్నాలో ఎమ్మెల్యే బి.వి రూపాక్షి ప్రస్తావించారని చెప్పారు. విషయం తెలుసుకోకుండా వైఎస్సార్‌సీపీపై నిందలు మోపి తప్పించుకుంటామంటే కుదరదన్నారు. విమర్శలు చేసే ముందు స్థాయి తెలుసుకోవాలని, అధికారంలో ఉన్నాం కాదా.. ఏదీ మాట్లాడినా చెల్లుతుందనుకుంటే పొరబడినట్లేనన్నారు. ప్రజల ముందు వాస్తవాలు ఉంచితే నిజమైన దోషులెవరో వారే తెలుస్తారన్నారు. ఈ ప్రాంత ప్రజలు ఇంత ఇబ్బందులకు గురికావడానికి కారణం టీడీపీ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. త్వరలోనే ప్రభుత్వంపై ప్రజలు తిరగబడతారన్నారు. సమావేశంలో నాయకులు హనుమంతరెడ్డి, గఫూర్ పాల్గొన్నారు.

ఆలయ స్థలాన్ని రక్షించండి



రెవెన్యూ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మద్దికెర : స్థానిక పందుల కుంటలో సర్వే నంబర్ 340లో గతంలో అధికారులు అయ్యప్ప ఆలయానికి 50 సెంట్లు కేటాయించారని, మళ్లీ 2014లో మరో 30 సెంట్లు కేటాయించారని, అయితే కొందరు ఆ స్థలాలను ఆక్రమించుకుంటున్నారని, వాటిని రక్షించి, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని దేవాలయ కమిటీ సభ్యులు కృష్ణ, పవన్ కోరారు. ఈ మేరకు సోమవారం వినతిపత్రాన్ని రెవెన్యూ సిబ్బందికి అందజేశారు. అయ్యప్ప ఆలయం నిర్మాణంలో ఉందని, కొందరు స్థలాన్ని ఆక్రమించుకొని షెడ్లు నిర్మించుకుంటున్నారని నిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వాహదారులకు లైసెన్స్ తప్పనిసరి

ఆలూరు:వాహనదారులు తప్పనిసరిగా అన్ని రకాల ధ్రువపత్రాలు కలిగి ఉండాలని ఆలూరు ఎస్‌ఐ సి.వి. నరసింహులు తెలిపారు. సోమవారం పట్టణంలోని గుంతకల్లు చౌరస్తా, బళ్లారి రోడ్డు, కర్నూల్, ఆదోని రోడ్డు సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. రికార్డులు లేకుండా వాహనాలు నడిపితే కేసులను నమోదుతో పాటు జరిమానా తప్పదన్నారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

కృష్ణగిరి: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలను తక్షణమే అందజేయాలని సీపీఐ నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామ సచివాలయంలో కార్యదర్శి సుంకన్నకు వినతి పత్రం అందజేశారు. ఈశ్వరయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

వెల్దుర్తిలో..

వెల్దుర్తిలో సీపీఐ మండల కార్యదర్శి కృష్ణ, రైతు సంఘం అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో స్థానిక సచివాలయం–2 సెక్రటరీ భావనకు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. పెట్టుబడి సాయం కింద రూ.20వేలను తక్షణమే విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కరువు మండలాల ప్రకటనలో చిత్తశుద్ధి కొరవడిందని విమర్శించారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకులు సుధీర్‌నాయుడు, చిన్న మాదులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

హొళగుంద: మండల కేంద్రం సమీపం కోగిలతోట రస్తాలోని కొండలో పేకాట ఆడుతున్న 15 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ బాలనరసింహులు సోమవారం తెలిపారు. పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు కొండలో గాలించి పేకాట ఆడుతున్న 15 మందిని అదుపులో తీసుకుని వారి నుంచి రూ.35,600 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అలాగే 8 బైకులు, రెండు స్టాండ్లు కలిగి ఉన్న చార్జింగ్ లైట్లు, పేక ముక్కలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

రేపు కప్పట్రాళ్లకు రామకృష్ణ రాక

దేవనకొండ: కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో యురేనియం తవ్వకాల ప్రతిపాదిత ప్రాంతం పరిశీలన నిమిత్తం ఈనెల 6వ తేదీన సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రానున్నారని సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి ఎం.నరసారావు సోమవారం తెలిపారు. మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో యురేనియం తవ్వకాల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం 68 బోర్ల తవ్వకాలకు అనుమతులు ఇవ్వడం వల్ల పరిసర 20 గ్రామాల ప్రజలు తీవ్ర స్థాయిలో ఆందోళన చెందుతున్నారన్నారు. అనుమతుల రద్దు కోసం, ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో మరింత చైతన్యం తీసుకొచ్చేందుకు పోరాటాన్ని మరింత ఉధృతం చేయనున్నారని చెప్పారు.